కుర్దిస్తాన్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం

దండేపల్లి (జన్నారం), అక్టోబర్ 17 : ఉపాధి కోసం కుర్దిస్తాన్ వెళ్లిన జన్నారం మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు (30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు కుర్దిస్తాన్‌కు దినసరి కూలీ వెళ్లాడు. ఆగస్టు 21న రోడ్డు ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చేందుకు భారత కాన్సోలేట్ జనరల్, ఎర్బిల్, ఇరాక్‌లో ఉన్న బత్తులు ఎల్లస్వామి, చింతగూడకు చెందిన యువకులు కీలకపాత్ర పోషించారు. ఎన్‌ఆర్‌ఐ శాఖ అధికారిగా పని చేసిన చిట్టిబాబు అంబులెన్స్ సహకారం అందించారు. దీంతో 57 రోజుల తర్వాత మృతదేహం స్వగ్రామానికి చేరుకున్నది. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. చింతగూడ గల్ఫ్ అసోసియేషన్, మాజీ ఎంపీటీసీ సుతారి వినయ్, మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బద్రీనయక్, శిరీశ్‌కుమార్, మేకల మాణిక్యం కలిసి ప్రభుత్వానికి విన్నవించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి కావడంతో 57 రోజుల తర్వాత ఈ నెల 17న ఇండియాకు చేరింది. అక్కడి నుంచి గురువారం స్వగ్రామానికి చేరింది. మృతదేహాన్ని తెచ్చేందుకు సహకారం అందించిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ నగేశ్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్, బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్ నాయక్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కారు బోల్తా-వ్యాపారి మృతి

బెల్లంపల్లి, అక్టోబర్ 17 : రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన వ్యాపారి రాజేశ్ కార్వా (45) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. బెల్లంపల్లి నుంచి కారులో బయలుదేరిన రాజేశ్ కార్వా సిద్దిపేట, గజ్వేల్ జిల్లా కుక్కనూర్ సమీపంలో అదుపు తప్పి కారు బోల్తా పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.దీంతో బెల్లంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

పెంచికల్ పేట్, అక్టోబర్ 17 మండలంలోని లోడ్పల్లి గ్రామానికి చెందిన నిరుపేద అనాథ వృద్ధుడు కుర్మ పోశం అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు. మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ అన్ని తానై ఆ వృద్ధుడికి గ్రామస్తుల సహకారంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

యువతి బైఠాయింపు

నెన్నెల, అక్టోబర్ 17 : నెన్నెల మండలంలోని గొల్లపల్లిలో రేషవేని రాజ్‌కుమార్ తనను పెండ్లి చేసుకోవాలని కోరుతూ అతని ఇంటి ముందు బైఠాయించి యువతి చేపడుతున్న దీక్ష రెండు వారాలుగా కొనసాగుతున్నది. రాజ్‌కుమార్, మైలారం గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని ఆ యువతి అడగడంతో ఆ యువకుడు తప్పించుకొని తిరుగుతున్నాడు. అతని ఇంటి ముందు యువతి బైఠాయించింది. యువతికి బీజేపీ నాయకులు, మహిళలు మద్దతు తెలిపారు.

శ్రీరాంపూర్ సీఐగా వేణుచందర్

శ్రీరాంపూర్, అక్టోబర్ 17 : శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా నూతనంగా బదిలీపై వచ్చిన వేణుచందర్ గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. సిరిసిల్ల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. శ్రీరాంపూర్ సీఐగా పనిచేసిన మోహన్ ఐజీకి అటాచ్డ్‌గా వెళ్లారు. సీఐ వేణుచందర్ సేవలందించారు. 2014 నుంచి 2016 వరకు శ్రీరాంపూర్ సీఐగా పనిచేసి ఇతర ఏరియాలకు బదిలీపై వెళ్లారు. తిరిగి శ్రీరాంపూర్‌కు బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

ఇద్దరికి గాయాలు

కన్నెపల్లి, అక్టోబర్ 17 : మండలంలోని కెస్లాపూర్ వడాల గ్రామాల మధ్య గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో రాజారాం గ్రామానికి చెందిన దుర్గం కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్న గుడిపేటకు చెందిన వీసు అంజన్న కేస్లాపూర్ వెళ్తుండగా రాజారం నుంచి కేస్లాపూర్‌కు వెళ్తున్న దుర్గం కృష్ణ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని చూడకుండా అంజన్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడ్డారు. అంజయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కృష్ణ వాహనాన్ని అతి వేగంగా నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని ఏఎస్ఐ తిరుపతి తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 17: మంచిర్యాల జిల్లా కేంద్రంలో సున్నంబట్టివాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ ముత్తె ప్రవీణ్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి వందఫీట్ల రోడ్డు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఏటకారి వెంకటేశ్ (38)ను మంచిర్యాల నుంచి సీసీసీ వైపు వస్తున్న ఆటో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన వెంకటేశ్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లి వైద్యం అందిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య సృజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బీఆర్‌ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబర్ 17 : మండలంలోని ఆకెనపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తోకల రమేశ్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గురువారం పరామర్శించారు. ఇటీవల కన్నాల జాతీయ రహదారి వద్ద జరిగిన ప్రమాదంలో రమేశ్ చిన్న కుమారుడు ప్రదీప్ మృతి చెందాడు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, నాయకులు సింగం గణేశ్‌గౌడ్, పొట్లపల్లి అజిత్‌రావు, పాయవేణి మల్లేశ్, ఆగిడి వెంకటేశ్, కాంపల్లి విశాల్, పంతంగి సంతోష్, రెడ్డి పోశం పాల్గొన్నారు.

కాలువ నిర్మాణం నిలిపివేయాలని వినతి

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 17: మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడలో ఉన్న చికెన్ సెంటర్ల సమీపంలో ఉన్న డ్రైనేజీకి వినాయక టెంపుల్ దగ్గర నుంచి నిర్మించే కాలువను కలపడంతో తమ ఇండ్లు వరదనీటిలో మునిగే ప్రమాదముందని, అందుకే ఆ కాలువ నిర్మాణాన్ని నిలిపివేయాలని 15వ వార్డు ప్రజలు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికే వరదలు వచ్చినప్పుడు ఇబ్బంది పడుతున్నామని, వినాయక ఆలయం వద్దనుంచి డ్రైనేజీని ఈ డ్రైనేజీకి కలిపితే తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీరాముల మల్లేశ్, 22 కుటుంబాల సభ్యులు ఉన్నారు.

అధ్యాపకుల ఆరోపణల్లో వాస్తవం లేదు

లక్షెట్టిపేట, అక్టోబర్ 17: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకుడు తిరుపతిపై అతిథి అధ్యాపకుడు సతీశ్ కుమార్ చేసే ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కళాశాల రెగ్యులర్, ఒప్పంద అధ్యాపకులు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ మహాత్మకు వినతిపత్రం అందజేశారు. తనపై అతిథి అధ్యాపకుడైన సతీశ్‌కుమార్ తరచూ కళాశాల కార్యక్రమాల్లో అడ్డంకులు, ఆటంకాలు చేస్తున్నాడని, కళాశాల అభివృద్ధికి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ అధ్యాపకులు శంకరయ్య, ప్రేమలత, నాగేశ్వర్‌రావు, తిరుపతి, సంతోష్, చంద్రశేఖర్, సంధ్యారాణి, సబిత, స్వప్న, శ్రీనివాస్, మల్లయ్య, రాజ్‌కుమార్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ కమర్షియల్ ఏడీఈగా బాలకృష్ణ

చెన్నూర్, అక్టోబర్ 17: చెన్నూర్ విద్యుత్‌శాఖ కమర్షియల్ ఏడీఈగా బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఈగా పని చేసిన రవికుమార్ బెల్లంపల్లికి బదిలీపై వెళ్లారు. వీరిద్దరినీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్, ఆరిఫ్, తిరుపతి సురేశ్, మహేందర్ పాల్గొన్నారు.

సిట్టింగ్ పాయింట్ నిర్వాహకులకు జరిమానా

మందమర్రి, అక్టోబర్ 17: మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలోని కనకదుర్గ వైన్స్ సిట్టింగ్ పాయింట్ నిర్వాహకులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. వైన్స్‌షాప్ ఫ్రిజ్‌లో నిన్నటి చికెన్‌ను నిలువ ఉంచి ఈ రోజు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ పలువురు గురువారం ఉదయం నిర్వాహకులతో గొడవకు దిగారు. అనంతరం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు తనిఖీలు చేసి అపరిశుభ్రంగా ఉండడం, వైన్‌షాప్ ఫ్రిజ్‌లో చికెన్ నిలువ చేయడాన్ని గుర్తించి సిబ్బంది పాయింట్ నిర్వాహకులకు రూ.2 వేలు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ ఎండీ సమీర్, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బంగారు శ్రీనివాస్, బిల్ కలెక్టర్ బూర్ల లింగయ్య ఉన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు

కోటపల్లి, అక్టోబర్ 17 : ఆయిల్ పాం సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారిణి అనిత అన్నారు. కోటపల్లి మండలం మల్లంపేటలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో మాట్రిక్స్ ఆయిల్ పాం ఇండస్ట్రీస్ ప్రైవేట్ సహకారంతో ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ కళ్యాణి, మ్యాట్రిక్స్ సీఈవో ఉదయ్‌కుమార్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మధుకర్, రైతులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మల్లేశ్ పేరు పెట్టాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 17 : నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనానికి స్థలం కేటాయించేందుకు సింగరేణి అధికారులతో మాట్లాడి కూరగాయల వ్యాపారులకు సహాయ సహకారాలు అందించిన మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ పేరు పెట్టడమే సబబు అని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి డిమాండ్ చేశారు. మార్కెట్ భవనానికి గుండా మల్లేశ్ నామకరణం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ నాయకులు ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో వేర్వేగా వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగం మల్లేశ్, చిప్ప నర్సయ్య, గుండా సరోజ, బొల్లం పూర్ణిమ, బొంతల లక్ష్మీనారాయణ, అక్కపెల్లి బాపు, గుండా చంద్రమాణిక్యం, మేకల రాజేశం, మంతెన రమేశ్, బొంకూరి రాంచందర్, రత్నం ఐలయ్య పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చూస్తాం


పొలాన్ని పరిశీలిస్తున్న కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్

నెన్నెల, అక్టోబర్ 17 : నెన్నెల మండలంలో యశోద కంపెనీకి చెందిన వరి విత్తనాలు సాగు చేసిన పంట పొలాలను గురువారం కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పరిశీలించారు. విత్తన తయారీలో జరిగిన లోపాలతో కొన్ని పిలకలు ముందుగా పొట్టకు వచ్చి ఈనుతున్నాయని చెప్పారు. దీనిపై శాస్త్రవేత్తలతో చర్చించి, విచారణ జరిపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

నస్పూర్, అక్టోబరు 17 : స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి సుధాకర్ నియమితులయ్యారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపిచంద్ ఉత్తర్వులు జారీ చేయగా అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రావు సుధాకర్‌కు నియామకపత్రం అందించారు.

పాత కక్షలతోనే గొడవలు : డీసీపీ భాస్కర్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 17:పాత కక్షలతోనే ఈ మధ్య కాలంలో కొంత మంది యువకులు ఆవేశంతో, చెప్పుడు మాటలు వినడంతో, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం గొడవలు పడుతున్నట్లు ఈ కేసుల్లో కొంత మంది యువకులపై కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపించడం జరిగిందని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సద్దుల బతుకమ్మ, దుర్గమాత నిమజ్జనం, అంతకు జరిగిన పలు దాడి ఘటనల వివరాలను డీసీపీ వెల్లడించారు. మంచిర్యాల జిల్లా లో ఇప్పటి వరకు వివిధ కేసుల్లో 1477 మందిని బైండోవర్లు, గంజాయి కేసులో 27 కేసులు నమోదు చేసి 82 మందిని అరెస్ట్ చేశామని, 194 మందికి కౌన్సెలింగ్, 37 మందికి మెడికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ ఇంట్లో జరిగిన దాడి కేసులో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. యువకులు గొడవల్లోకి వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్, ఎస్ఐలు సనత్ రెడ్డి, ముత్తె ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మాట్లాడుతున్న రాష్ట్ర ఆదివాసీ సంఘం అధ్యక్షుడు బుర్స పోశయ్య

దహెగాంలో..

ఆసిఫాబాద్‌లో కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పోరాటయోధుడు కుమ్రం భీంకు ఘన నివాళి

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, అడవి బిడ్డల హక్కుల కోసం 'జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో దండుకట్టి పోరాటం సాగించిన గోండు బెబ్బులి కుమ్రం భీమ్ వర్ధంతిని గురువారం మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాటం, త్యాగాన్ని స్మరించుకున్నారు.

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 17

పెంచికల్ పేట్ : జిల్లెడలో విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

తాండూర్ ఐబీలో..

కోటపల్లిలో..

జన్నారం: ఇందన్‌పల్లిలో..

దండేపల్లి :గుడిరేవు పాఠశాలలో..

తెలంగాణ భవన్‌కు తరలిన బీఆర్‌ఎస్వీ నాయకులు

బీఆర్‌ఎస్వీ సమావేశంలో బాల్క సుమన్‌తో కోటపల్లి మండల విద్యార్థి సంఘం నాయకులు

కేటీఆర్, బాల్కసుమన్‌తో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు

కోటపల్లి, అక్టోబర్ 17 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం సమావేశానికి కోటపల్లి మండలం నుంచి బీఆర్‌ఎస్వీ నాయకులు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్లు బీఆర్‌ఎస్ కోటపల్లి మండల యువ నాయకులు ఆసంపల్లి సంపత్ కుమార్ తెలిపారు. అనంతరం చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కోటపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో ఆకుదారి చందు, దుర్గం గంగారాం, ఎలుకల మహేశ్, చకినారపు అజయ్ తదితరులున్నారు.

నాయకులను కలిసిన జిల్లా అధ్యక్షుడు..

బెల్లంపల్లి, అక్టోబర్ 17 : బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్వీ ప్రతినిధుల సమావేశంలో బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ పాల్గొన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్‌ను ఆయన కలిశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రతి మండలం, కళాశాలలో బీఆర్‌ఎస్వీ కమిటీలు వేయాలని కేటీఆర్ సూచించినట్లు శ్రావణ్ పేర్కొన్నారు. విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే విద్యార్థి నాయకులకు భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని కేటీఆర్ వివరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ నాయకులు ఆడెపు అరుణ్, బుద్ధార్తి సుమంత్, వడ్డేపల్లి నితీశ్, నరేశ్, శ్రీనివాస్, వంశీ, సాయికిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 17:జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గురువారం విద్యార్థులు, గైడ్ టీచర్స్ వీ రాజేశ్, డీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో బయలుదేరినట్లు పేర్కొన్నారు. కృత్రిమ మేధ అనే అంశంపై వీరు ప్రదర్శనివ్వనున్నట్లు తెలిపారు.

ఉత్పత్తిపై డైరెక్టర్ సమీక్ష

శ్రీరాంపూర్, అక్టోబర్ 17 : శ్రీరాంపూర్ ఓసీపీలో ఉత్పత్తి, ఉత్పాతకతపై గురువారం సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టులు జీఎం వెంకటేశ్వర్‌రెడ్డి ఓసీపీపై జీఎం సంజీవరెడ్డితో కలిసి అధికారులతో ఉత్పత్తి, ఉత్పాదతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఓసీపీ క్వారీని వ్యూ పాయింట్ నుంచి పరిశీలించారు. ఓసీపీపై బొగ్గు నిల్వ ఉండకుండా వినియోగదారులకు రవాణా చేయాలని ఆదేశించారు. అనంతరం ఓసీపీ కాంట్రాక్టర్లు సీఆర్‌ఆర్, జీవీఆర్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నెలవారీ, వార్షిక, ఓబీ లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టూజీఎం సత్యనారాయణ, పీవో శ్రీనివాస్, అధికారులున్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

వినతి పత్రం ఇస్తున్న చైర్ పర్సన్ జంగం కళ

మందమర్రి, అక్టోబర్ 17: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో గల ప్రభుత్వ స్థలంలో ఓపెన్ జిమ్ మంజూరైందని, ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కబ్జాదారుల నుంచి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. 19వ వార్డు ఖాళీ స్థలాన్ని తాము ఆక్రమించలేదని ఆలయాన్ని నిర్మించామని, దానిన్ని కూల్చి వేయవద్దని కోరుతూ ఆ వార్డుకు చెందిన పలువురు మహిళలు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

గెలుపోటములను సహజంగా తీసుకోవాలి

విజేతలతో పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు

హాజీపూర్, అక్టోబర్ 17 : క్రీడాకారులు గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అన్నారు. మండలంలోని గుడిపేటలో ఉన్న 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో మూడు రోజుల నుంచి పోలీసులకు నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ హాజరై మాట్లాడుతు క్రీడలలో ఓటమి చెందామని నిరాశ చెందకుండా పట్టుదలతో ఆడి గెలుపొందేందుకు శాయాశక్తుల కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్ రావ్, కాళిదాసు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్ఐలు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, శిక్షణ పొందుతున్న పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

శ్రీరాముడి చరిత్రను లిఖించి రామాయణ గ్రంథాన్ని దేశంతో పాటు ప్రపంచానికి అందించిన మహనీయుడు ఆదికవి వాల్మీకి మహర్షి అని నాయకులు, అధికారులు వక్తలు కొనియాడారు. వాల్మీకి జయంతి వేడుకలను మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 17

కొటాల : తాటిపల్లి గ్రామంలో వాల్మీకి ఆలయం

హాజీపూర్ : వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న బెటాలియన్ కమాండెంట్

మందమర్రి : మున్సిపల్ కార్యాలయంలో..


తాండూర్‌లో..

రెబ్బెన : తహసీల్ కార్యాలయంలో..

వాల్మీకి ఆలోచనా విధానం గొప్పది

వాంకిడి, అక్టోబర్ 17: మహర్షి వాల్మీకి ఆలోచనా విధానం గొప్పదని, ఆయన సమాజానికి విలువైన గ్రంథాలు అందించారని వాంకిడి మాజీ సర్పంచ్ బండే తుకారాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో బోయ కులస్తుల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోయ కులస్తులు నాయకులు టెంకే బిక్కజి, జీ శ్రావణ్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

సిర్పూర్(యూ), అక్టోబర్ 17: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామం జైనూర్ నుంచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆదివాసీ బిడ్డ మెస్రం సాయి శ్రద్ధను ఆదివాసీ నాయకులు గురువారం మండల కేంద్రంలో సన్మానించారు. టైలరింగ్ చేసుకుంటూ ఉపాధి పొందే మెస్రం జ్ఞానేశ్వర్, లక్ష్మి దంపతుల కూతురు ఉన్నత చదువులకు వెళ్లడం జాతికే గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆత్రం భగవంత్‌రావ్, వైస్ ఎంపీపీ ఆత్రం ఓంప్రకాశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మరావ్, నీలకంఠం, ఎస్జీవోల సంఘం రాష్ట్ర నాయకులు ఆడే వెంకటేశ్ నాయకులు ఉన్నారు.

ఈత చెట్ల తొలగింపు అనుమతి రద్దు చేయాలి

రెబ్బెన, అక్టోబర్ 17: రెబ్బెన మండలంలోని నంబాల గ్రామంలోని వాగుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు 400 ఈత చెట్ల తొలగింపు అనుమతి రద్దు చేసి గౌడ కులస్థులను ఆదుకోవాలని నంబాల గీత కార్మిక సంఘం సభ్యులు వడ్లకొండ రామాగౌడ్, తాళ్లపల్లి తిరుపతిగౌడ్, ముక్కెర రవిగౌడ్, గౌడ సంఘం సభ్యులు రంగు మహేశ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి జ్యోతికిరణ్‌కు వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం రేణుకా ఎల్లమ్మ మాతా ఆలయం నిర్మించి పక్కన వాగు వద్ద ఉన్న ఈత చెట్లపై ఆధారపడి పలు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించి అనుమతి నిలుపుదల చేయాలని కోరారు.

మంత్రికి వినతుల వెల్లువ

రెబ్బెన, అక్టోబర్ 17: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కకు పలువురు వినతి పత్రాలు అందించారు. సీఆర్టీ ఉపాధ్యాయులు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారులు, గోలేటి ఓసీపీ త్వరగా ప్రారంభం అయ్యే విధంగా కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు, వట్టివాగు కాలువలు మరమ్మతులు చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందించారు.

పేపర్‌మిల్లు నుంచి బయలుదేరిన లారీలు

కాగజ్‌నగర్, అక్టోబర్ 17: కాగజ్‌నగర్ పట్టణంలోని జేకే పేపర్ మిల్లు, లారీ అసోసియేషన్ మధ్య 21 రోజులుగా వివాదం జరుగుతున్నా విషయం తెలిసిందే. తమ డిమాండ్లు పరిష్కరించాలని లారీలను అసోసియేషన్ వారు అడ్డుకోవడంతో జేకే పేపర్ మిల్లు యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు బుధవారం రాత్రి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పత్రాలను గురువారం జేకే పేపర్ మిల్లు ప్రతినిధులు కాగజ్‌నగర్ పోలీసులకు అందించారు. దీంతో పేపర్ మిల్లు లోపల నిలిపి ఉన్నా నాన్ లోకల్ లారీలు అర్ధరాత్రి గమ్యస్థానానికి బయలు దేరాయి.

వేల ఎకరాల అటవీ భూములను కార్పొరేటర్లకు కట్టబెట్టే ందుకు యత్నం

కాగజ్‌నగర్, అక్టోబర్ 17: అభివృద్ధి పేరుతో వేల ఎకరాల అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలో కుమ్రం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేసా చట్టాన్ని అమలు చేయాలన్నారు. గిరిజన హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవి కుమార్, జిల్లా కార్యదర్శి కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, కార్తీక్, రాజేందర్, బక్కన్న, వనిత, తదితరులున్నారు.

ఎస్సీ కాలనీలో నీటి గోస

ఎడ్ల బండిపై డ్రమ్ములో నీటిని తెచ్చుకుంటున్న కాలనీ వాసులు

భీమారం, అక్టోబర్ 16 : ఎస్సీ కాలనీలో నీటి గోసతో స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నాలుగు నెలలుగా బోరు మోటరు చెడిపోవడంతో అధికారులు మరమ్మతులు చేయడం లేదని వాపోతున్నారు, ఎడ్ల బండి ద్వారా వ్యవసాయ బావుల వద్ద నీటిని తెచ్చుకుంటున్నామని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి !

హాజీపూర్, అక్టోబర్ 17 : మండలంలోని ముల్కల్ల గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో (బాలుర) 5వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయంత్రం 4 గంటల సమయంలో పాఠశాల బిల్డింగ్ పై నుంచి దూకినట్లు సమాచారం. తీవ్రగాయాలైన విద్యార్థిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన కాల్ లిఫ్ట్ చేయలేదు. హాజీపూర్ పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

కల్వరీ ఉపవాస దీక్షల ముగింపు సభ


భారీగా హాజరైన క్రైస్తవులు

కాసిపేట, అక్టోబర్ 17 : మంచిర్యాల జిల్లా సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరి మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్ చేపట్టిన 50 రోజుల ఉపవాస దీక్షల సభ గురువారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క హాజరయ్యారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశ నలమూలల నుంచి లక్షలాది మంది క్రైస్తవులు తరలివచ్చారు. ముగింపు సభకు మంత్రి సీతక్క, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపవాస దీక్ష ముగించి పాస్టర్ ప్రవీణ్ ప్రసంగించారు. క్రైస్తవులను ఆశీర్వదించారు. దేశ శాంతి కోసమే ఉపవాస దీక్షలు చేపడుతున్నట్లు కల్వరీ మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. సిస్టర్ షారూన్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మాజీ జడ్పీటీసీ రాంచందర్, మాజీ సర్పంచ్ ప్రమీలాగౌడ్, సిస్టర్ షారూన్, నిర్వాహకులు ముత్తినేని రవికుమార్, శ్రీనివాస్ క్రైస్తవులు పాల్గొన్నారు.